## అరుదైన గౌరవం



తెలంగాణ బిడ్డ, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అందించడం హర్షనీయం. ఈ పురస్కారం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. పీవీకి భారత రత్న ప్రకటించాలని గతంలోనే బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

**- గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే**

## పదవులకే వన్నెతెచ్చిన మహానేత




మంథని ఎమ్మెల్యేగా నాలుగుసార్లు గెలిచిన పీవీ ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా పదవులకే వన్నె తెచ్చిన మహానేత. ఈ పురస్కారం తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. పీవీకి పురస్కారం ప్రకటించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు. బీఆర్ఎస్ సర్కారు సైతం గతంలో ఆయన శతజయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించి సముచిత గౌరవమిచ్చింది.

**-పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్**

# భారతరత్న మన పీవీ

- మాజీ ప్రధానికి దేశ అత్యున్నత పురస్కారం
- అవార్డుపై ఉమ్మడి జిల్లాలో సర్వత్రా హర్షం
- స్వగ్రామం వంగరలో మిన్నంటిన సంబురం
- మంథని నుంచే రాజకీయ ప్రస్థానం
- తనదైన ముద్ర వేసుకున్న మౌనముని
- నాడు పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- స్వరాష్ట్రంలో కేసీఆర్ వల్లే నరసింహారావుకు అరుదైన గౌరవం
- అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు



స్వర్గీయ మాజీ ప్రధాని పీవీతో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు (ఫైల్)

బహుబాషా కోవిధుడు.. పాలనా దక్షుడు.. జ్ఞాన సంపన్నుడు.. రాష్ట్రంలో భూ సంస్కరణలకు.. దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆధ్యుడు.. ప్రపంచమే కీర్తించిన తెలంగాణ ముద్దుబిడ్డ.. మన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఇప్పుడు 'భారత రత్న'మయ్యారు. అభిమానుల ఏండ్లనాటి కలను సాకారం చేస్తూ కేంద్రం శుక్రవారం పీవీకి భారతరత్న ప్రకటించింది. పీవీని నాడు కాంగ్రెస్ పాలకులు విస్మరించినా.. స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కారు సముచిత గౌరవం ఇచ్చింది. జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడంతో పాటు శతజయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించి పత్యేక స్థానం కల్పించింది. తాజాగా కేంద్రం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంబురాలు జరుపుకొన్నారు.



పెద్దపల్లి, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపూర్ గ్రామంలోని రుక్నాబాయి సీతారామారావు దంపతులకు 1921 జూన్ 28న జన్మించిన పీవీ, అక్కడే తన ప్రాథమిక విద్యను మొదలు పెట్టారు. తరువాత ఉమ్మడి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి పాములమూర్తి రంగారావు, రుక్మిణమ్మ అతన్ని దత్తత తీసుకోవడంతో అప్పటి నుంచి పాములమూర్తి వెంకట నరసింహారావు అయ్యారు. ఆయన పుట్టింది లక్నెపూర్.. పెరిగింది వంగరలో అయితే, రాజకీయ ప్రస్థానం మాత్రం అలనాటి మంత్రపురి నేటి మంథని నుంచే. ఇందుకు గుర్తుగా మంథని ప్రజలు పీవీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని ఇప్పటికీ ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారతరత్న అవార్డు పొందిన తొలి వ్యక్తిగా పీవీ చరిత్రలో నిలిచారు.

### మంథనితో పెనవేసుకున్న బంధం

పీవీ సుదీర్ఘ రాజకీయ చరిత్ర మంథని ప్రజలతో ఆత్మీయ బంధం పెనవేసుకున్నది. కాంగ్రెస్‌లో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్న పీవీ తొలుత 1952లో కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. తొలి ఎన్నిక కలిసి రాక పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత 1957లో జరిగిన ఎన్నికల్లో మంథని అసెంబ్లీ నుంచి సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా గెలిచి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. 1957, 1962, 1967, 1972 వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. 1962 నుంచి 1971 మధ్యన కీలక మైన శాఖలకు మంత్రిగా పనిచేశారు. 1971 నుంచి 73 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న సమయంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దృష్టిలో పడ్డారు. దీంతో ఆమె పీవీని జాతీయ రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించడంతో 1977లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో హన్మకొండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఒక్కో అందలం ఎక్కుతూ చివరికి ప్రపంచమే కీర్తించే విధంగా భారత దేశ ప్రధానిగా తన పరిపాలన దక్షతను చాటారు.

### కేసీఆర్ పాలనలో పీవీకి గుర్తింపు

భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మరణానంతరం ఆయనకు కల్పించాల్సిన గౌరవాన్ని అప్పటి కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు కల్పించలేదు. ఆయన దహన సంస్కారాలను సైతం సరిగా నిర్వహించలేదని అపవాదును మూటకట్టుకున్నది. కానీ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అంతటితోనే ఆగకుండా ఆయన శత జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు శత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించింది. ఆయన జీవిత చరిత్రను వివరించేలా ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహించింది. పీవీ రాజకీయ ఆరంగేట్రం చేసి చివరి వరకూ కొనసాగిన కాంగ్రెస్ మాత్రం ఆయనకు సముచిత గౌరవం ఇవ్వలేదు. ఆయన కుటుంబం నుంచి కాంగ్రెస్‌లో ఒక్కరికి కూడా రాజకీయంగా అవకాశాలు కల్పించలేదు. బీఆర్ఎస్ సర్కారు పీవీ సేవలను గుర్తించి గౌరవించడమే కాకుండా ఆయన కూతురు వాణీదేవికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. అలాగే 2016 జూలైన 28న అప్పటి మంథని ఎమ్మెల్యే, ప్రస్తుత జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ పట్టుబట్టీ మరీ మంథనిలో తొలి పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అప్పటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఘనంగా ప్రారంభింపజేశారు.












## ప్రాపర్టీ షోకు విశేష స్పందన



ఉస్మాని అసోసియేట్ నిర్మాణాల గురించి వివరిస్తున్న ప్రతినిధులు



సోలార్ పవర్ గురించి తెలుసుకుంటున్న సందర్శకులు

కార్పొరేషన్, ఫిబ్రవరి 9: కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రాపర్టీ షోకు విశేష స్పందన వచ్చింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన పలు ప్రముఖ సంస్థలతో పాటు జిల్లాకు చెందిన వివిధ రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్స్‌తో పాటు నిర్మాణ రంగానికి సంబంధించిన సోలార్ సంస్థలు, సిమెంట్, వుడ్‌కు సంబంధించిన సంస్థలు, నిర్మాణాలకు రుణాలు అందించే బ్యాంకులు, వివిధ ఫైనాన్స్ సంస్థలు స్టాళ్లు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్టాళ్లను సందర్శించి నిర్మాణ రంగానికి సంబంధించి వివిధ సంస్థలు అందిస్తున్న ఉత్పత్తులు, వాటి వ్యయాలు, వివరాలు తెలుసుకున్నారు.





